# లవ్ ఇన్ టివీ!

'యాంకరింగ్ అంటే ఆషామాషీ కాదు డాడీ! ప్రోగ్రాం నిర్వహించటం రోజూ కత్తిమీద సామే! పరాకులు చిరాకులు వుండకూడదు. ఏకాగ్రత అవసరం! అద్భుతమైన జ్ఞాపక శక్తి వుండాలి! లైవ్ ప్రోగ్రాం టెలీకాస్ట్ అంటే అత్యంత జాగ్రత్త అవసరం....'

'ఆపాపు తల్లీ! నీ వుపన్యాసం వినే ఓపిక లేదు గానీ... నాకు అర్థం కానిదల్లా... నువ్వు బి.టెక్ చదివి... ఎం.బి.ఏ చేసి... హోమ్‌సైన్స్‌లో డిప్లమా తీసుకుని... చివరకు నువ్ ఛూజ్ చేసుకున్న జాబిదా?- నీ టేస్టేమిటో నీ భవిష్యత్ ప్రణాలికేమిటో నాకు బొత్తిగా అర్థమై చావటం లేదు...' బుర్ర గోక్కున్నాడు సుదర్శనం.

'ఇందులో అర్థంకానిదేముంది డాడీ! నాకు టి.వీ ఛానల్స్‌లో యాంకరింగ్ చేయాలనేది నా లైఫ్ యాంబిషన్! చదువు నాలెడ్జ్ కోసమే! ఎన్నుకున్న వృత్తి నాకు తృప్తినిస్తోంది డాడీ! ఐలైక్ అండ్ ఐలవ్ దిస్ ప్రొఫెషన్...' తండ్రిని సమీపించి వెనగ్గా అమాంతం కౌగిలించుకుని గారం పోయింది విశాలి.

'విశాలీ! నీ ఎడ్యుకేషన్ విషయంలో నేను ఇంటర్ఫియర్ కాలేదు- ఇప్పుడు నీ జాబ్ విషయంలో కూడా స్వంత నిర్ణయం తీసుకున్నావ్- ఎందుకిలా చేశావని నేనడగను. నాకు కొడుకువైనా కూతురువైనా నువ్వే! నీ ఇష్టమే నా ఇష్టం! కాకపోతే మన స్టేటస్‌కి తగిన జాబ్ కాదని సొసైటీ వ్యాఖ్యానిస్తే నేనదివిని సహించలేను- రేపు మనస్థాయికి తగిన వరుడు నువ్వీ యాంకరింగ్ చేస్తున్నావని తెల్సి మేరేజ్‌కి అంగీకరించకపోవచ్చేమో అనేదే నాకున్న బెంగ!... అండ్రస్టాండ్!'- మరోసారి నచ్చచెప్పబోయాడు.

'ఆవిషయం కూడా నా నిర్ణయానికే వదిలెయ్ డాడీ!... నాకు నచ్చినవాడి చేతే మెళ్లో తాళి కట్టించుకుంటాను...' సోఫాలో కూర్చుంటూ తన మనసులో ఆలోచన తండ్రికి విప్పి చెప్పింది.

'ఓకే దెన్! నా గుండెలమీద భారాన్ని తగ్గించే ప్రయత్నంలో వున్నావన్న మాట.... గుడ్!... వెరీ గుడ్!-'

'డాడీ! నీకు మరో ఆశ్చర్యం కల్గించే విషయమొకటి చెప్పనా?-'

తలాడించాడు సుదర్శనం దిగ్రేట్ ఇండస్ట్రియలిస్ట్!.

'ఇంటర్వ్యూలో నా ఫెర్ఫార్మెన్స్‌కి ముగ్ధులై 'ఇంటింటా వంట' అనే

ప్రోగ్రామ్‌కే యాంకరింగ్ చేయమంటూ అపాయింట్ మెంట్ ఆర్డర్ క్షణాల్లో చేతికిచ్చారు'

'ఐ.సీ...'

'నా ప్రోగ్రామ్ అదిరిపోతోందనుకో! మహిళల నుండి నా యాంకరింగ్ అద్భుతంగా వుందని ఎస్.ఎం.ఎస్‌లు తెగవస్తున్నయ్ తెలుసా?-' గర్వంగా ఫీలవుతూ చెప్పింది.

'వెరీగుడ్! కీపిటప్!- అవునూ... నీకో విషయం చెప్పటం మరచాను... మీ అత్తయ్య స్టేట్స్‌నుండి వస్తోంది. నేరుగా వచ్చి మనతోనే వుంటుంది కొన్నాళ్లు. పసితనంలోనే నీకు దూరమైన తల్లిలేని లోటు తీర్చి మాసిస్టర్ నిన్ను పెంచి పెద్ద చేసింది! పదేళ్లకు మళ్లీ ఇండియా వస్తోంది. నేను వెళ్లి అత్తయ్యను రిసీవ్ చేసుకొస్తాను- ఆఁ!... బైదిబై... నువ్వు మాత్రం టి.వీలో యాంకరింగ్ జాబు చేస్తున్నావని దాంతో చెప్పకు- మన నిర్ణయానికి నవ్విపోతుంది. ఇలా ఎందుకు జరిగిందని నామీద కారాలు మిరియాలు నూరుతుంది. నన్ను ఎడాపెడా వాయిస్తుంది. మా సిస్టర్ దృష్టిలో నువ్ చేస్తోంది ఎందుకూ పనికిరాని వుద్యోగంగా భావించి మన ప్రాణాలు తోడేస్తుంది- అండ్రస్టాండ్....'

'ఆ విషయం నాకొదిలెయ్ డాడీ!... నే చూచుకుంటాగా...' అనేసి తన బెడ్‌రూమ్ వైపు నడిచింది వైశాలి.

× × × ××

'నీ పద్ధతి నాకు బొత్తిగ నచ్చలేదే విశాలి! ఎంత చదువు చదివావ్ నువ్వు? చివరికిలాంటి ఛీప్ జాబ్ చేస్తున్నావంటే... నాకే నామర్ధాగా వుంది.. నీకు సిగ్గనిపించటం లేదూ?-'

'ఆంటీ! నువ్ అమెరికాలో ఇనేళ్లున్నా నీ మైండ్‌సెట్ మారలేదు. నాకీవుద్యోగం మహా ఇష్టం!...'

'ఏడిశావులే! రేపు పెళ్లి కూడా ఏభటాచోర్ గాడినో చేసుకుంటావా ఏమిటి?-

'ఆంటీ నీకో విషయం చెప్పనా?...'

'కొంపదీసి లవ్‌లోగాని పడలేదు కదా?-'

'బలే గెస్ చేశావ్ ఆంటీ! ఐలైక్ యు... ఐలవ్‌యూ...'

'ఎవడైనా వంటవాడిని ప్రేమించావా?- నీవుద్యోగం... అదే యాంకరింగ్ చేస్తోంది వంటల గురించి కదా...'

'వాళ్లని వంటవాళ్లనరు...'

'కాకపోతే స్టార్ హోటళ్లో కుక్కు... లేదూ ఏ కేటరింగ్ చేసుకునే వాడో అయివుండాలి...'

'నీ ధోరణి మార్చుకో ఆంటీ! నేను ప్రేమిస్తున్న తను మలేషియాలో ఓ పెద్ద ఇంటర్నేషల్ స్టార్ హోటల్లో షెఫ్!

'ఓస్ అంతేకదా..'

'అంతేకాదు. అతనికి రాని వంటంటూ లేదు ప్రపంచంలో అన్ని దేశాలూ తిరిగిన వాడు. అన్ని భాషలూ వచ్చు! అమెరికా ప్రెసిడెంట్‌కి అవినాష్ చేతి వంటంటే ఎంతో ఇష్టం! విమానాల్లో తిరగే మనిషి! అతని నెల జీతం ఇరవై లక్షలు!- అలా నిర్ఘాంతపోకు మరి!- అలాంటి అవినాష్‌ని మా టి.వీ వాళ్లు 'ఇంటింటా వంట' ప్రోగ్రామ్ కోసం బోలెడంత ఖర్చు చేసి మలేషియా నుండి పిలిపించి కొత్త కొత్త వంటకాలు అతడితో చేయించారు. అలాంటి గొప్ప వ్యక్తితో పరిచయం కాగానే మా చూపులు మనసలు కలిశాయి. ఉంగరాలు మార్చుకున్నాం!- ఆంటీ ఈ సీక్రెట్ డాడీకి ఇంకా చెప్పలేదు...'

'నన్ను చెప్పమంటావుటే...'

'వద్దులే! నువ్ లేనిపోనీ వన్నీ కల్పించి చెప్పి మాడాడీ మనసు పాడు చేస్తావ్.- నీ బుద్ధి నాకు తెలీదా?- సమయం చూచి డాడీతో నేనే ఎస్సన్నిస్తాను... ఏం?-'

'నీ విషయం నీ ఇష్టం!- నా జోక్యం దేనికిలే...' నొచ్చుకున్న మనసుతో అక్కడి నుండి లేచి తన గదిలోకి దారి తీసింది పురంధేశ్వరి ఆంటీ.

విశాలి నోట ప్రేమ విషయం విన్న క్షణం నుంచి పురంధరేశ్వరికి నిద్ర పట్టి చాటం లేదు. బుర్రలో పురుగు తొలస్తున్నట్లుగా వుంది. ఇంత బతుక బతికి ఇంటివెనుక చచ్చినట్టు ... ఎంతో పెద్ద పెద్ద చదువులు చదివిన విశాలి... పోయి పోయి ఓ విదేశీ వంటవాడిని లవ్వాడటమేమిటి?.. పిదపకాలం... పిదప బుద్దులూను!

ఎర్రగబుర్రగ వుండి కన్ను ముక్కు తీరు బావుంటే చాలు ఓ... ప్రేమ ప్రేమంటూ ఒకరి వెంట మరొకరు పడిపోయే కాలమిది. తొందరపడి ప్రేమించం... తర్వాత పెళ్లి... మూడు నిద్రలు అయిపోగానే విడాకుల కోసం వెంపర్లాడటం!-

ప్రేమ వ్యవహారాలు వేలం వెర్రి అయినయ్! పెద్దాళ్లు కాదంటే... ఫానుకు వురేసు కోవటమో... విషం మింగటమో... లేకపోతే రైలు క్రింద పడటమో? ఏం పిల్లలో ఏమో?-

విశాలి తల్లిలేని పిల్ల కావటంతో తన చేతులతో పెంచింది. ఉగ్గుపోసింది. లాలపోసింది. తలదువ్వింది... కాన్వెంట్‌కు రెడీ చేసి పంపేది.

ఎంతో ఆప్యాయంగా పెరిగిన విశాలికి ఈ పెడబుద్ధి ఏమిటి చెప్మా!- ఒక్కగానొక్క నలుసుకదాని గారాబంగా పెంచివుంటారు. ఇష్ఠమొచ్చినట్టు చదువుకో నిచ్చాడు డాడీ!

అందువల్లే ఈనాడీ పెడబుద్ధులు! అదే తల్లి గాని బ్రతికి వుండి... తల్లి పెంపకంలో పెరిగి వుంటే ఇలా తైతక్కలేడేదా?

ఈవిషయం తమ్ముడికి తెలిస్తే ఇంకేమైనా వుందా? అగ్గిమీద గుగ్గిలమౌతాడు. తన పరువు కన్నా కూతురే నట్టేట ముంచినందుకు జుట్టు పీక్కుని తలగోడ కేసి బాదుకుంటాడు!

పురంధశ్వేరి మనసు పరిపరి విధాల ఆలోచిస్తోంది. పోనీ... తమ్ముడితో ఓ మాటుచెప్పి చూస్తే?!- అమ్మో ఇంకేమైనావుందా?- విశాలి రాక్షసి మీదపడి రక్కదూ? డాడీతో చెప్పద్దంటూ ప్రామిస్ కూడా చేయించుకున్నాదాయె?

విశాలిలో మొండితనం ఎక్కువ. పెడసరంగ వాదిస్తుంది. పెద్ద చిన్న లేకుండా వాగుతుంది. తొందరపడితే దీనితో డేంజరే! చుట్టం చూపుగా వచ్చి నాలుగు రోజులు వుండిపోవటానికొచ్చిన తనకెందుకులే అని అంతరాత్మకు సద్దిచెప్పుకోలేకపోతోంది పురంధేశ్వరి!

పురంధరశ్వేరంటే అల్లా టప్పామనిషేం కాదు. ఆవలించకుండానే పేగులు లెక్కేయగల దిట్ట!

ఆడ దిక్కులేని ఇల్లు కావటంతో... ఇదిగో... ఇలా ఎవరికి వారే తయారైనారు.

తమ్ముడిని మందలిస్తే విశాలి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్పించింది పురంధరేశ్వరికి

'అదిగాదురా తమ్ముడూ... నువ్వేమో వ్యాపారం అంటూ ఇల్లుపట్టకుండా దేశాలు పట్టుకు తిరుగుతావ్! నీ కూతురేమో దాని ఇష్టానుసారం ప్రవర్తిస్తోంది! ఇంట్లో బొత్తిగా డిసిప్లిన్ కరువైనట్టన్పిస్తోంది రా సుదర్శనం...'

'నిజమే! ఆ విషయం నాకూ తెల్సు! కానీ ఏమీ చేయలేని పరిస్థితి అదేం చిన్నపిల్ల కాదు... చెవి మెలేసి చెప్పి దండించటానికి!- దానికి ఇష్టమైన చదువు పూర్తి చేసింది. దానికి వచ్చిన వుద్యోగం చేస్తోంది... నేను మాత్రం ఏం చేయను?'

'చూడూ... నీ ధ్యానంతా సంపాదనమీదే! ఇంకా ఎందుకురా సంపాదించాలనే తపన?- ఇప్పటికే కోట్లకి అధిపతివి... అయినా ఆర్జించాలనే ఆరాటం చావలేదు నీలో- అందుకే ఇల్లు పట్టకుండా నువ్వు తిరుగుతున్నావ్... వైశాలి తన నిర్ణయాలు తాను స్వతంత్రంగ తీసుకుంటోంది...'

'ఇప్పుడేమైందే అక్కా?'

'ఏమీ కాకముందే దాని పెళ్లి చేసి అత్తారింటికి పంపటం మంచిదనిపిస్తోంది...'

'నేనెప్పుడు పెళ్లి విషయం ప్రస్తావించినా అదేమో... అప్పుడే ఏం తొందరంటూ విషయాన్ని దాటేస్తున్నది. నన్నేం చేయమంటావ్ చెప్పు?-'

ఒరే చవటసన్యాసీ!... దద్దమ్మా!... ఆడపిల్ల పెళ్లి విషయం వాయిదా వేస్తున్నందంటే... కన్నతండ్రివైయ్యుండి దాని మనసులో ఏం దాగుందో.. ఏం గ్రహించావ్ నువ్వు!- నువ్వు దాన్ని క్రాస్ ఎగ్జామిన్ చేసి అసలు పాయింటేమిటో ఆరాతీశావాని?-'

'నాకు అంత తీరిక ఎక్కడ ఏడ్చిందే?-'

'దానికా ముప్పైయ్యేళ్లు నిండబోతున్నయ్! ఇంకా ఎప్పుడ్రా దాని పెళ్లి చేస్తావ్?- నువ్వు దాని పెళ్లి గురించి పట్టించుకోకుంటే... అదెవడినో లవ్ చేస్తునానేస్తుంది. ఇద్దరూ మెడలో పూలదండలతో వచ్చి నీకాళ్లకు వంగి నమస్కరించి ఆశీర్వదించమనే రోజొస్తుంది. అప్పుడు నెత్తి బాదుకున్నా... కుయ్యో మొర్రో అన్నా ప్రయోజనం వుండదు... నే చెప్తోంది బుర్ర కెక్కుతున్న దట్రా?-' స్వరం పెంచింది పురంధరేశ్వరి.

'అంతేనంటావా అక్కా...'

'అక్షరాల అంతే! మనరోజులు కావురా ఇవి! ఈ రోజుల్లో పిల్లలే స్వతంత్ర నిర్ణయాలు తీసేసుకుంటున్నారు. ఎందరిని చూడటం లేదు....?-'

'నన్నేం చేయమంటావో చెప్పు...'

'ఆడదిక్కులేని సంసారం ఇట్లాగే ఏడుస్తుంది! విశాలికి జన్మనిచ్చి నీ భార్య

చనిపోయాక... మళ్లీ నిన్ను పెళ్లి చేసుకోమని ఎంతపోరినా నామాట నీ చెవికెక్కకపోయె!... సవతి తల్లి వస్తే పిల్ల బాధ్యత గురించి శ్రద్ధ వహిస్తుందోలేదోని సినీమా డైలాగులు వల్లించావు- ఇప్పుడు చూడు... నీ సంసారం ఎవరికి వారే యమునాతీరే అన్నట్టుగా తయారైంది... అంతానీ ఖర్మలే...' నిట్టూర్చింది.

'అబ్బా! ఫ్లాష్ బేక్ ఎందుగ్గాని... జరగాల్సిందేమిటో చెప్పవే...'

'ఆ పాయింట్‌కే వస్తున్నాను-'

'అదిగో విశాలి రానే వచ్చింది. రామ్మా... రా!...' కూతురు సడన్‌గా సీన్లోకి ఎంటరవటం చూస్తూ అన్నాడు సుదర్శనం.

'వాట్... నాగురించే డిస్కస్ చేసుకుంటున్నారట్లే వుంది...' కూర్చుంటు అంది విశాలి.

'నీ గురించి కాదే... మనింటి విషయాల గురించి చర్చించు కుంటున్నామే...' నవ్వింది పురంధరేశ్వరి.

'అవునమ్మా!- నీ పెళ్లి చేసి పప్పన్నం ఎప్పుడు పెట్టిస్తావంటూ అడుగుతోంది మా అత్తయ్య...'

'అందుకు మీరేమన్నారు?-'

'ఇంకా ఏం అన్లేదు. ఇంతలో నువ్వొచ్చావ్- కాబట్టి ఈ మేటర్‌ను పరిష్కరించాల్సింది నువ్వే...'

'నేనా?...'

'విశాలి ఏం చెప్తుందిరా..? దానికన్న తండ్రిగా నీ నిర్ణమేమిటో చెప్పరా... నీ ఎరికలో ఏదైనా మంచి సంబంధం చూశావా విశాలికి?-'

'డాడీ ఏం చెప్తాడులే ఆంటీ- నేనింకా నా మనసులో మాట డాడీతో చెప్పనే లేదు కదా?-'

'ఏమిటి విశాలీ ఆ విషయం?-'

'ఆ ఏముంది లేరా... ఓ వంటవాడిని నీ కూతురు లవ్ చేసింది...'

అక్కమాటకు నివ్వెరపోయాడు సుదర్శనం.

'ఆంటీ... వంటవాడని హేళనగా మాట్లాడవద్దనాన్నా.. ఇంకోసారి అన్నావంటే నాకు చిర్రెక్కుతుంది...'

'అసలు విషయం ఏమిటో చెప్పు విశాలీ...'

'అదేం చెప్తుంది. నే చెబుతా విను! నీ కూతురు ఓ మలేషియా కుర్రాడిని ప్రేమించింది. అతని వుద్యోగం వంటలు చేయటమంట!... పోయి పోయి అలాంటి వూరు పేరులేని ప్రబుద్ధుడిని లవ్ ఆడిందేమిట్రా ఇది? చదువుకున్నదన్న మాటేగాని విశాలకు బొత్తిగా బుద్ధీ, జ్ఞానం లేకుండా పోతుంది! ఛ.. ఛ.. ఏం మనుషులో ఏం ప్రేమలో?-'

'అక్కయ్యా! నువ్వు కాస్సేపు ఆగు! దాన్ని చెప్పనీయ్!... అవును... ఇవన్నీ నీకెలా తెలుసు?-'

'ఆడవాళ్లం కదా... అన్నీ ముందుగా మాకే తెలిసేడుస్తయ్! మీ మగాళ్లకు తెలియకుపోగా చెబితే అర్థం కూడా చేసుకుని ఏడవలేరు...'

'సరే సరే!... కొంచెం ఎమోషన్స్‌ని కంట్రోల్ చేసుకో... లేకపోతే బి.పి. పెరిగి హాస్పిటల్ పాలవుతావ్...'

'చూస్తూ వుండరా... ఇది మన పరువు వీధిన పడేస్తుంది. లవ్వనే పేరుతో అడ్రసులేని వాడితో పూడియిస్తుంది. అప్పుడు నువ్ అఘోరించి ప్రయోజనం వుండదు. డేటింగులు.. మీటింగ్‌లు నాగరికతలో కొట్టుకుపోతున్నార్రా ఈ రోజుల్లో ఆడపిల్లలు మొగపిల్లలూ!- పెద్ద వాళ్ల మాట వినే రోజులా ఇవి?...'

'ఆంటీ! నువ్ హైరానపడకు. డాడీకి వివరంగానే చెప్తానుగా...'

'నా విశాలి ఎప్పుడూ తొందరపడి తప్పుడు నిర్ణయాలు తీసుకోదు. నాకు తెలుసు!... చెప్పు తల్లీ ఏం చెప్పాలనుకుంటున్నావో వివరంగ చెప్పు...'

'నేను విశాల్‌ని లవ్ చేస్తున్నాను డాడీ!-'

'అతనెవరు?-'

'అన్ని దేశాలు తిరిగిన వాడు. ప్రపంచంలో గల అన్ని భాషలూ మాట్లాడగలవాడు. విమానాల్లో తప్పించి ప్రయాణం చేయనివాడు... అతనికి రాని వంటకం లేదు. చెయ్యలేని డిష్ లేదు. మనతో తూగగల ధనవంతుడు! బంగళా... కారు... బ్యాంకు బాలెన్సు... నౌకర్లు చాకర్లు... హై శాలరీ... ఆరడుగుల అందగాడు... సంస్కారవంతుడు.. సద్గుణ సంపన్నుడు...'

'అర్థమైంది తల్లీ! నీ మనసేమిటో... నిర్ణయమేమిటో గ్రహించాను. బట్...' ఆగి పురంధశ్వేరి ముఖంలోకి చూశాడు.

'నన్ను పూర్తిగ చెప్పనీయండి డాడీ!- విశాల్ వాళ్ల డాడీ రిటైర్డ్ ఐ.పి.ఎస్.

ఒక్కగానొక్క కొడుకు. అతనే విశాల్!'

'ఇంతకూ అతను...' అర్థోక్కిలో ఆగాడు సుదర్శనం.

'ఆఁ! ఆ పాయింట్‌కే వస్తున్నాను డాడీ!-

'అది కాదే అమ్మాయ్!- వాడే కులమో... ముందు అది చెప్పు...' ఎద్దేవ చేసినట్లు మాట్లాడింది.

'ఆంటీ... ఈరోజులో కులాల గురించి ప్రస్తావించటం నేరం! చట్టం శిక్షిస్తుంది తెలుసా?-'

'మీ అత్తయ్య మాటకేమొచ్చెగాని... నువ్వు చెప్ప తల్చుకున్నదేమిటో అది చెప్పు ఒక్క ముక్కలో...'

'నే లవ్ చేస్తున్న విశాల్ 'పప్పు' వారబ్బాయి. పప్పు రామకృష్ణ శాస్త్రి గారి ఏకైక పుత్రుడు...'

ఆ మాటకి నివ్వెరపోయిన పురంధేశ్వరి తాను అనవసరంగా అనేక రకాలుగా ఆలోచించినందుకు నాలుక్కర్చుకుంది.

'అవున్రా!... విశాలిది టి.వి.లవ్వు! ఇది అవుద్యోగం చేయకపోతే.. పప్పు వారి అబ్బాయితో పరిచయం అయ్యేది కాదు... లవ్‌లో పడివుండేదీ కాదు- ఇంకా ఆలస్యం దేనికి?- తొందర్లో మేళ తాళాలు ఇంట్లో మోగనీయ్!- హమ్మయ్య... ఇప్పుడూ గుండె బరువు తగ్గినట్టుంది...' పకపకానివ్వంది.

'నా విశాలి ఎప్పుడూ తెలివితక్కువ పని చేయదు. సరైన నిర్ణయాలే తీసుకుంటుంది.. అందుకే నాకూతురంటే నాకెంతో ఇష్టం!!-' దగ్గరై కూతరు తల ఆప్యాయంగ నిమిరాడు సుదర్శనం.

'సరే డాడీ!... నేను డ్యూటీకి వెళ్లేటైమైంది. నేవెళ్లొస్తాను...' విశాలి బైటికి నడిచి కారెక్కింది.

వెడుతున్న కూతరును చూచి సంబరపడుతూ 'నే చెప్పలేదా అక్కయ్యా! నా విశాలి ఎన్నటికీ నా కుటుంబ గౌరవాన్ని గంగపాలు చేయదు. నా చిట్టి తల్లి నడివడిక మీద నాకు సంపూర్ణ విశ్వాసం వుంది అక్కా...' అన్నాడు.

'సరే సరే... లేటు చెయ్యకుండా వెళ్లి ఆ పప్పు రామకృష్ణ శాస్త్రి గారితో పెళ్లివిషయం ఖాయం చేసుకునిరా!-'

సుదర్శనం వెళ్లి గోడకున్న కేలండర్ తెచ్చి తిథి వార నక్షత్రాలను చూచి

'అక్కా!... రేపు విదియ గురు వారం వర్జ్యం లేదు... దివ్యమైన రోజు...!

'ఇంకేం? ఆలస్యం అమృతం విషం!- రేపే బయలుదేరి వెళ్లు. నేను మళ్లీ నాకొడుకు దగ్గరకు అమెరికా వెళ్లే లోపు నిశ్చయ తాంబూళాలు పుచ్చుకుంటే కళ్లారా చూచి ఆనందిస్తారా సుదర్శనం...' తొందర పెట్టింది.

'మనం 'నేతి' వారం కదా?.. పప్పు వారితో సంబంధం కలుపుకుంటే భలే మజాగా వుంటుంది కదక్కా?-' సంబరపడుతూ మాట్లాడేడు.

'బాగానే వుంది నీ జోకు...' అన్నది పురంధశ్వేరి.

ఆ సాయంత్రం విశాలి డ్యూటీ ముగించుకు ఇంటికొస్తూ సి.డి. ఒకటి తెచ్చింది.

అందరూ కలిసి టీ తాగుతున్న సమయంలో విశాలి లేచి వెళ్లి తాను తెచ్చిన సి.డిని విసిడిలో పెట్టి 'డాడీ! మీక్కాబోయే అల్లుడు విశాల్‌ను చూపిస్తా చూడండి..' ఆన్ చేసింది.

'అరె... విశాల్ అందగాడే' అన్నది పురంధరేశ్వరి.

'అన్ని విధాలా సూటైన వాడు కాబట్టే కదా విశాలి లవ్ చేసింది!...' అన్నాడు సుదర్శనం.

'అది వాళ్ల డాడీ వాళ్ల బంగళా! అందులో అంకుల్ ఆంటీ ఇద్దరూ మన సిటీలో ఉంటారు... అదేమో.. మలేషియాలో విశాల్ ఉండే విల్లా చూడండి ఎంత మోడరన్‌గా బ్యూటిఫుల్‌గా వుందో?...' ఒక్కో దృశ్యాన్ని వివరిస్తోంది విశాలి.

'నో లేట్ చిట్టి తల్లీ... టుమారో గోయింగ్ అండ్ ఫిక్సింగ్ దిస్ మ్యాచ్! వాట్ డు యూసే...' సుదర్శనం అనటంతో విశాలి మురిసింది. ఆంటీ ముఖంలో సంతోషం పురివిప్పింది.

(సమాప్తం)